నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 గురువారం 11 జూలై 2024
MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

# తప్పుల తడకగా ట్రాన్స్‌ఫర్ల జాబితా

- ఆందోళనలో గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులు
- సీనియార్టీ లెక్కల్లో దొర్లిన తప్పులు
- డేట్ ఆఫ్ బర్త్ విషయంలో కొందరికి ప్రత్యేక మినహాయింపులు
- నిబంధనల ప్రకారం చేయడం లేదంటూ ఆవేదన



మంచిర్యాల, జూలై 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీలు జరుగుతున్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం అన్ని శాఖలు, అన్ని కేడర్లలో 40 శాతం మంది ఉద్యోగులను బదిలీ చేయాల్సి ఉంటుంది. సీనియార్టీ, ఉద్యోగి వయసును పరిగణలోకి తీసుకుని ఈ ట్రాన్స్‌ఫర్స్ చేయాలి. కానీ.. మంచిర్యాల జిల్లా పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్ బుధవారం విడుదల చేసిన గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శుల జాబితా మాత్రం ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శుల బదిలీని పంచాయతీరాజ్ కమిషనర్ నేరుగా చేస్తుండగా, గ్రేడ్-4 కార్యదర్శుల బదిలీ బాధ్యతలను జిల్లా అధికారులకు అప్పగించారు. జిల్లాలో 184 మంది గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులు పని చేస్తుండగా నిబంధనల అనుసరించి 40 శాతం మందిని అంటే 72 నుంచి 73 మందిని బదిలీ చేయాల్సి ఉంది. ముందుగా 1991 సంవత్సరం కంటే ముందు పుట్టిన ఉద్యోగులను మాత్రమే ట్రాన్స్‌ఫర్ చేస్తామని, వారిలో ఆ కోట నిండకపోతే సీనియార్టీ, వయసులో ఎవరు పెద్దవారైతే వారిని ట్రాన్స్‌ఫర్ చేస్తామని అధికారులు చెప్పారు. కానీ.. వచ్చిన జాబితాలో మాత్రం 1991లో పుట్టిన కొందరు ఉద్యోగులను వదిలేసి 1993లో పుట్టిన ఉద్యోగులను జాబితాలో చేర్చారు. డేట్ ఆఫ్ బర్త్ విషయంలోనే కాకుండా సీనియార్టీ విషయంలోనూ ఇదే తప్పిదాలు చేశారు. ఉదాహరణకు ఒకటి చూసుకుంటే.. చెన్నూర్ రూరల్ మండలం దుగ్నేపల్లి పంచాయతీ కార్యదర్శి సెప్టెంబర్ 9వ తేదీ 2019న జాయిన్ అయ్యారు. లెక్క ప్రకారం ఆయన 4 సంవత్సరాల 9 నెలల సీనియార్టీ కలిగి ఉండగా, వచ్చిన జాబితాలో 5 సంవత్సరాల 9 నెలల 18 రోజులు అని పెట్టారు. ఈ తప్పిదంతో ఆయన సీనియార్టీ లిస్టులో 4వ స్థానంలో ఉన్నారు. ఇలా జాబితా మొత్తంలో చాలా మందిని అన్యాయం జరిగిందంటూ గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులు ఆరోపిస్తున్నారు. కలెక్టర్‌తో సంతకం చేయించి మరి తప్పులున్న జాబితాను విడుదల చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం బదిలీలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీరాజ్ జిల్లా అధికారి వెంకటేశ్వర్లను వివరణ కోరగా.. బదిలీల జాబితాలో చోటు చేసుకున్న తప్పులను సరిచేస్తామని, అభ్యంతరాలను స్వీకరిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ సంతకం చేసినా జాబితాను మార్చవచ్చని ఇందులో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

## రైస్‌మిల్లుల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీ



ధాన్యాన్ని తనిఖీ చేసిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి

జన్నారం, జూలై 10 : జన్నారం మండలంలోని మొర్రిగూడలో రాఘవేంద్ర రైస్‌మిల్‌లో పెద్దపల్లి జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు బుధవారం తనిఖీలు చేశారు. రైస్ మిల్, గోదాంలో నిల్వ చేసిన బియ్యం బస్తాలు, వడ్ల బస్తాలను పరిశీలించారు. స్టాక్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో భాగంగా రాఘవేంద్ర రైస్ మిల్‌లో సోదాలు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలో డీఎంసీఎస్ శ్రీకాంత్, మంచిర్యాల డీటీ వరదరాజ్, తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, డీటీ రామ్మోహన్, ఎస్ఐ రాజవర్ధన్ పాల్గొన్నారు.

# వేతనాలు ఇయ్యలే..

## పదవీకాలం ముగిసినా అందని గౌరవ వేతనం

- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రావడం లేదు..
- ఆరు నెలలుగా ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీల అవస్థలు

మంచిర్యాల, జూలై 10(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పదవీకాలం ముగిసినా ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనం అందడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఎంపీపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీలు గౌరవ వేతనం అందుకోకుండానే పదవీకాలం ముగిసిపోయింది. గత ప్రభుత్వాల హయాంలో ప్రజాప్రతినిధులకు నామమాత్రపు వేతనాలు అందేవి. కేసీఆర్ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రజాప్రతినిధులకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని భావించారు. ఎంపీటీసీలకు నెలకు రూ.750 ఉన్న గౌరవ వేతనాన్ని రూ.5వేలు, ఎంపీపీలకు రూ.1500ల నుంచి రూ.10వేలు, జడ్పీటీసీలకు రూ.2,250ల నుంచి రూ.10 వేలకు పెంచారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ పెరిగిన నేపథ్యంలో మరోసారి వారి వేతనాలను 30 శాతం పెంచాలని కేసీఆర్ సంకల్పించి పెంచారు. దీంతో రూ.5 వేలు ఉన్న ఎంపీటీసీల గౌరవ వేతనం రూ.6500లకు, జడ్పీటీసీ, ఎంపీపీలకు రూ.5 వేలు ఉన్న గౌరవ వేతనాన్ని రూ.13 వేలకు కేసీఆర్ ప్రభుత్వం పెంచింది. అప్పటి వరకు రూ.7,500 గౌరవ వేతనం అందుకునే జడ్పీ చైర్మన్లకు కూడా రూ.ఒక లక్షకు పెంచి అందరూ ప్రజా ప్రతినిధులను గౌరవం కల్పించి వారికి వేతనాలను సకాలంలో అందించేవారు. సమైక్య పాలనలో నామమాత్రపు జీతానికి పరిమితమైన ప్రజాప్రతినిధులు కేసీఆర్ పాలనలో గౌరవ వేతనం ప్రకటించి వారి కష్టానికి తగినట్లు వేతనాలు అందిచడంపై ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వేతనాలు రావడం లేదు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాప్రతినిధులకు వేతనాలు రావడం లేదు. కాగా, గౌరవ వేతనం పొందకుండానే తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ చైర్మన్లు పదవీ నుంచి దిగిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు జరిగినప్పటి నుంచి ఒక్క రూపాయి కూడా గౌరవ వేతనం అందకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంపీపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీలు గుర్రుగా ఉన్నారు. కేసీఆర్ ప్రభుత్వం తమకు గౌరవ వేతనం అందించి తగిన గుర్తింపును అందించిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తమ గౌరవ వేతనాలను నిలిపివేసిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎంపీపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం ముగియగా ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు తమకు వస్తాయా? రావా? అనే సందిగ్ధంలో ఉన్నారు.



మంచిర్యాల జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో తమకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు చెల్లించాలని వినతిపత్రం సమర్పిస్తున్న మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీలు (ఫైల్)

### వినతిపత్రం అందించినా..

మంచిర్యాల జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం గత నెలలో జరగగా, జిల్లాలోని జడ్పీటీసీ, ఎంపీపీలు తమకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు చెల్లించాలని అప్పటి మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌కు వినతి పత్రం సమర్పించారు. తమ పదవీకాలం త్వరలో ముగియనుందని, ముగియకముందే వేతనాలు అందించాలని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. అయినప్పటికీ నేటికీ వారికి గౌరవ వేతనం అందకపోవడంపై మాజీలు కాంగ్రెస్ సర్కారు పాలనపై అసంతృప్తితో ఉన్నారు.

### ఉమ్మడి జిల్లాలో 59 మంది జడ్పీటీసీలు, ఎంపీటీసీలకు అందని వేతనం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నలుగురు జడ్పీ చైర్మన్‌ల తోపాటు 59 మంది జడ్పీటీసీలు, 64 మంది ఎంపీపీలు, 507 మంది ఎంపీటీసీలకు గౌరవ వేతనం అందలేదు. కేసీఆర్ ప్రభుత్వంలో క్రమం తప్పకుండా వేతనాలు పొందిన జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆరు నెలలుగా గౌరవ వేతనాలు పొందలేదు. జూలై 4వ తేదీతో పదవీ కాలం ముగిసి వీరంతా మాజీ ప్రజా ప్రతినిధులు అయినా కాంగ్రెస్ సర్కారు మాత్రం కనికరం చూపకపోవడంపై విమర్శలు వెలువడుతున్నాయి.

### వినతి పత్రం అందించినా స్పందన లేదు..



తమకు అందించే గౌరవ వేతనం పెండింగ్‌లో ఉందని తమ పదవి ముగిసేలోపు వేతనాలు అందించాలని గత నెలలో జరిగిన జిల్లా పరిషత్ సర్వ సభ్యసమావేశంలో వినతి పత్రం సమర్పించినా నేటి వరకు స్పందన లేకుండా పోయింది. ప్రజా సేవ కోసం పని చేసిన ప్రజా ప్రతినిధులకు సకాలంలో గౌరవ వేతనా లు అందితే వారు ఉత్సాహంగా పని చేసే అవకాశం ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీల వేతనాలను నిలుపదలచేసి మా పైన చిన్నచూపు చూసింది. - మంత్రి సురేఖ, మాజీ ఎంపీపీ, కోటపల్లి.

### ప్రజా ప్రతినిధులకు గౌరవం ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వం



ప్రజా ప్రతినిధులకు సముచిత గౌరవం అందించింది కేసీఆర్ ప్రభుత్వమే. సమైక్యపాలనలో నామమాత్రపు వేతనం ఉండే. ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీలకు గౌరవ వేతనాలు అందించి కేసీఆర్ చరిత్ర సృష్టించాడు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి ఉన్నన్నీ రోజులు క్రమం తప్పకుండా వేతనాలు వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్క రూపాయి కూడా రాలేదు. మా పదవీ దిగిపోయిన మాకు రావాల్సిన గౌరవ వేతనం నేటి వరకు అందలేదు. - మోతె తిరుపతి, మాజీ జడ్పీటీసీ, చెన్నూర్.

### ఐదు నెలల నుంచి జీతాలు లేవు..



జైనూర్, జూలై 10 : జైనూర్ మండల ఎంపీపీగా పనిచేశా. ఇటీవలే పదవీకాలం పూర్తయింది. కానీ.. ఐదు నెలల నుంచి జీతాలు రావడం లేదు. మండల అభివృద్ధికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు కృషి చేశా. కనీసం పదవీకాలం ముగిసిన రోజైనా వేతనాలు ఇచ్చి ఉంటే సంతోష పడేటోళ్లం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా వేతనాలు వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇలా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు వేతనాలు ఆపడం సిగ్గుచేటు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి మా పెండింగ్ వేతనాలు చెల్లించాలి. - కుమ్ర తిరుమల, మాజీ ఎంపీపీ, జైనూర్

### బీఆర్ఎస్ హయాంలో ప్రతి నెలా వచ్చేవి..



వాంకిడి, జూలై 10: ఏడు నెలలు గడుస్తున్నా మాకు ప్రతి నెలా వచ్చే రూ.13500 గౌరవ వేతనాలు అందలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా సకాలంలో జడ్పీటీసీలకు గౌరవ వేతనాలు వస్తుండేవి, మా పదవి కాలం ముగిసినప్పటికీ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇప్పటి వరకు వేతనాలు అందలేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి వేతనాలను వెంటనే చెల్లించాలి. - అజయ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ, వాంకిడి




వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంచిర్యాల కలెక్టర్ దీపక్ కుమార్, అధికారులు

# భూసేకరణ వేగవంతం చేయాలి

- జాతీయ రహదారుల నిర్మాణంపై వీడియోకాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

నస్పూర్, జూలై 10 : జాతీయ రహదారుల నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని అంబేద్కర్ సచివాలయం నుంచి మంత్రి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ మంచిర్యాల-వరంగల్-విజయవాడ జాతీయ రహదారి 163జీ 334 కిలోమీటర్ల మేర ఉంటుందని, ఇందుకు గాను 1383 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంటుందని, ఈ క్రమంలో ఇప్పటి వరకు 1,284 హెక్టార్ల భూమికి అవార్డు జారీ చేసినట్లు తెలిపారు. 415 హెక్టార్ల భూమి జాతీయ రహదారుల సంస్థకు అప్పగించామని, పెండింగ్‌లో ఉన్న 99 హెక్టార్ల భూసేకరణ నెల రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల జాతీయ రహదారి 63 నిర్మాణం 132 కిలోమీటర్ల మేర ఉంటుందని, 536.9 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉండగా 542 హెక్టార్ల భూమి సేకరించినట్లు తెలిపారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జాతీయ రహదారులు 163జీ, 63 నిర్మాణంలో భాగంగా ఇప్పటి వరకు 75 శాతం భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి రహదారుల సంస్థకు అప్పగించినట్లు తెలిపారు. మిగిలిన 25 శాతం భూసేకరణను 10, 14 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీవో శివ్‌ఆశిష్‌సింగ్, అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవోలు రాములు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.









అంగన్‌వాడీ టీచర్లతో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

# అంగన్‌వాడీ విద్య.. పిల్లల జీవితానికి పునాది

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 10 : జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే విద్య పిల్లల జీవితానికి పునాది అని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సఖీ కేంద్రంలో తిర్యాణి మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల రోజు వారీగా అభివృద్ధి వివరాలను నమోదు చేసేందుకు 5జీ ట్యాబ్‌లను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ కలిసి అంగన్‌వాడీ సూపర్ వైజర్లకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తిర్యాణి మండ లం ఆస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. మండలంలోని 30 అంగన్‌వాడీ కేంద్రాల్లో రోజు వారీగా చేపడుతున్న పనులను పోషణ ట్రాకర్ అప్లికేషన్‌లో నమోదు చేసేందుకు ట్యాబ్‌లను అందించినట్లు తెలిపారు. ప్రతి రోజూ అంగన్‌వాడీలో లబ్ధిదారులకు పిల్లలు, గర్భిణులకు అందించే ఆహారం, పిల్లల పూర్వ ప్రాథమిక విద్య, గృహ సందర్శన, నెలవారీ సేవలలో భాగంగా పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, టీకాలు, సామాజిక కార్యక్రమాలు న మోదు చేస్తామని తెలిపారు. జిల్లాలో 973 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయని, రోజు వారీగా పిల్లల ఎదుగుదలపై సరైన వివరా లు అందిస్తే వారి సంరక్షణకు ప్రభుత్వం మరి న్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లకు పాఠ్య ప్రణాళికతో పాటు విద్య బోధన మెటీరియల్ తయారీపై శిక్షణ ఇస్తామని, ప్రీ స్కూల్ కిట్ ప్రతి కేంద్రానికీ అందిస్తామని, ఇందులో పిల్లల వర్క్ బుక్స్, పర్ఫార్మెన్స్ అసెస్మెంట్ కార్డ్స్ , ప్రొఫైల్ బ్యాగ్స్ , బొమ్మలు, రంగుల, కథల కార్డులు, రంగులు, గమ్ వంటివి ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు అభివృద్ధి ప్రాజెక్ట్ అధికారి సాదియ, తిర్యాణి బ్లాక్ సమన్వయకర్త మణివేలు, పోషణ్ అభియాన్ సమన్వయకర్త గోపాల కృష్ణ, సఖీ సెంటర్ సమన్వయకర్త మమత, తిర్యాణి సూపర్ వైజర్లు తిరుపతమ్మ, విజయ, యశోధ, మాస్టర్ ట్రైనర్లు కళావతి, సింధూర, స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులపై దృష్టి పెట్టాలి

### ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 10: పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టి పెట్టాలని, సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి బాధితులకు మెరుగైన సేవలందించాలని పోలీసు అధికారులను కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు ఆదేశించారు. నేరాల నియంత్రణపై నెల వారీ సమీక్షా సమావేశాన్ని బుధవారం ఆసిఫాబాద్‌లోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలపై విచారణ సమర్థవంతంగా చేస్తూ పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రతి సర్కిల్ పరిధిలో దొంగతనాల నివారణకు స్పెషల్ టీం నియమించాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ డీఎస్పీలు సదయ్య, కరుణా కర్, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు

# వన మహోత్సవం లక్ష్యాన్ని నెలాఖరులోగా పూర్తి చేయాలి

- ప్రజలందరి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలి
- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



వీసీలో మాట్లాడుతున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే




పాల్గొన్న అధికారులు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 10: వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే లక్ష్యాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని వివిధ శాఖల అధికారులను కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్‌తో కలిసి ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఈజీఎస్ ఏపీవోలు, అటవీ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖకు 35.25 లక్షలు, అటవీ శాఖకు 10.30 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, రైతు వేదికలు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచి మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వించాలని, అన్ని శాఖల సమన్వయంతో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజలను భాగస్వామ్యంతో నిర్వహించాలని సూచించారు. ప్రతి ఇంటికీ మొక్కలు పంపిణీ చేసి నాటి సంరక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని, దోమల నివారణ, సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. అదనపు డీఆర్డీవో రామకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

